స్కెచ్

# త్యాగ ఫలం

ద్రోణంరాజు కృష్ణమోహన్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు నాగరాజు జీవితంలో స్థిరపడలేదు 1934లో రెండేళ్లు 1942లో మూడేళ్లు జైలుకెళ్ళాడు 1946లో అరెస్టయి వెంటనే జాతీయ ప్రభుత్వం ఏర్పడగానే విడుదలయ్యాడు 1948లో సెకండరీ గ్రేడ్ ట్రెయినింగులో చేరాడు, వున్న మూడెకరాల భూమి అమ్మివేసి. బడి పంతులుగా, పెరుగుతున్న సంసార భారాన్ని మోయలేక 'దేహి' అని అడగలేక, చివరకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశంతో రాజకీయ బాధితుడుగా ఒక దరఖాస్తు పారేశాడు ఆలనా పాలనాలేదు ఒకసారి ఒకచోట ఎక్కడో మారుమూలన కొండలదగ్గిర ఐదెకరాలువస్తే అఖ్కర్లేదన్నాడు ఎక్కడయినా స్కూలున్న పల్లెటూరులో దొరుకుతుందేమోనని ఎదురు చూస్తున్నాడు దేశానికి, కాంగ్రెసుకు చేసిన సేవకు, కనీస ప్రతిఫలం, అంటే ఉదర పోషణకు ఒక స్థిరమైన జీవనం నిమిత్తం వేచివున్నాడు. త్యాగాలు చేసి వున్నందువల్లనేమి, నిజాయితీ పరుడు, శాంతమూర్తి అన్న పేరు వున్నందువల్లనేమి, ఉపాధ్యాయులందరిలోను మంచి పలుకుబడి, గౌరవం సంపాదించుకొన్నాడు.

ఈ సంగతి ఎలక్షన్‌లో పోటీ చేస్తున్న కాంగ్రెసు అభ్యర్థి అనంతయ్యకు, స్వతంత్ర అభ్యర్థి అబద్ధయ్యకు, ఇద్దరికీ తెలుసు ఇద్దరూ చాలా బలవంతులు, లక్షాధికారులు అనంతయ్యకు 70 ఎకరాల మాగాణి, బస్తీలో రెండు మేడలు, పల్లెటూరులో లంకంత కొంప వున్నాయి. అయితే ఏనాడు జైలుకెళ్లలేదు. అబద్ధయ్య పొగాకు ఫ్యాక్టరీ యజమాని. ఇంకా కొన్ని కంపెనీలలో పెద్ద వాటాలున్నాయి 1942లో మాత్రం జైలుకెళ్ళాడు, ఆరునెలల పాటు కొంచెం చదువుకున్నాడు. అయినా తనకు కాంగ్రెసు టిక్కెట్ దొరక్కపోయేసరికి అభ్యుదయ స్వతంత్రుడుగా నిలబడ్డాడు!

"నామాట విను. మీ మేష్టర్ల వోట్లు అన్నీ కుటుంబాలతో సహా కలిపితే దాదాపు 400 వరకు వుంటాయి అవి గనుక ఇప్పించగలిగావో, నేను గెలిచానో, ఇక నీ కోరికలకి అడ్డులేదనుకో" జాతీయోద్యమంలో ఏనాడు జైలు కెళ్ళక-యుద్ధకాలంలో ధాన్యం, బియ్యం బ్లాక్‌మార్కెట్ చేసి రెండు మేడలు కట్టించి యీనాడు కాంగ్రెసు టిక్కెట్ పుచ్చుకున్న అనంతయ్య కదిపి చూసేడు కాస్త, నాగరాజుని.

"ఇంతకు నానా అవస్థలుపడి త్యాగాలు చేసిన వాళ్లమంతా యీ సంసారాలు పెరిగి జీతాలు చాలక, దరఖాస్తులు పెడితే కుల, వర్గ, తత్వాలతో త్రోసివేస్తూ, మూలబడివుంటే, ఇక వరాలు మంజూరు చ్హేసేది మీబోటి చిన్న జమీందార్లు గాక మరెవరూ?" ఘాటుగా ప్రశ్నించాడు నాగరాజు నవ్వాడు అనంతయ్య.

"నీ కెందుకు. దరఖాస్తు నేను మంజూరు చేయించి పెడతాను, గెలిచినా వోడినా సరే. ముందు మరి పనిచెయ్యి కావలస్తే కొద్దిగా ముట్టజెప్పతాలే సుంచు" ఆశ చూపాడు అనంతయ్య.

"నీ డబ్బుకోసమా! హు! మా ఖర్మ ఇలా కాలింది!" తల పట్టుకున్నాడు నాగరాజు

"అయ్యో పిచ్చోడా! నీ కెందుకయ్యా బాధ! నీకో ఐదెకరాల మంచి పొలం సరిగ్గా హైస్కూలున్న వూళ్లో మంజూరు చేయిస్తాగా"

అంతా తన చేతిలోనే వున్నట్లు చెప్పేశాడు. నాగరాజుకి సందేహం లేదు, అనంతయ్యకు గల పలుకుబడి విషయంలో. కాని న్యాయంగా ధర్మంగా తనబోటివాడికి ఎవరి

కయినా అభ్యర్థిత్వం ఇచ్చి సంస్థ గౌరవాన్ని కాపాడవలసిన పెద్దలే ఇటువంటి సంఘ ద్రోహుల చేతిలో చిక్కి కాంగ్రెసును అట్టడుక్కి త్రోసివేయడం, అటువంటి వాళ్లకోసం ఎలక్షన్‌లో ప్రచారం చేయడం, నీచమని తోచింది నాగరాజుకి.

"మంజూరు చేయించడం నీ చేతిలో వుందేమోగాని వోట్లు వేయించడం నాచేతిలో వుందా?"

"అదేం మాటలే! నిన్ను కాదనరు ఎలాగో మూడోవాడు లేడు ఈ పోటీలో ఆ పొగాకు కంపెనీవాడేగా నాకు ఎగనెస్టు! బస్తీ వోట్లు కాసిని చీల్చానంటే గెలుపు నాదే! తప్పదు" ధైర్యంగా చెప్పాడు.

"సరే అలాగే చూద్దాం"

"చూద్దామంటే కాదు గట్టిగా పనిచేసి పోలింగు రోజున వోట్లు వేయించి వెళ్ళాలి ఇదిగో." లేస్తూ రెండు వంద రూపాయల నోట్లు తీశాడు జేబులోంచి నాగరాజుకి ఝల్లుమంది గుండె మహాపరాధమేదో చెయ్యబోతున్నట్లు తోచింది గుండెలు టకటక కొట్టుకోసాగాయి. మొదటిసారిగా ఆ పని చేయబోతున్నాడు. ఎదురుగుండా మహాత్ముడు బోసి నోటితో చూస్తూనేవున్నాడు. కళ్లు దించేసుకొని, మెల్లగా నోట్లు జేబులో పెట్టుకున్నాడు నాగరాజు, తీవ్రమైన బాధతో, చెయ్యి ముందుకు చాచలేక, చాచలేక....

* * *

"ఏనాడు జైలు మొహం చూడని వెధవ సన్నాసి వాడికిచ్చి, జైలుకెళ్ళిన నన్ను వొదిలేశారు చూశావా ఎంత అన్యాయమో!" వాపోయాడు స్వతంత్ర అభ్యర్థి అబద్ధయ్య

"నిజమే బాబూ రోజులు మారాయి. డబ్బున్నవాడికే ఎలక్షన్లు నీతి, నిజాయితీ, ధర్మం, ఎవడిక్కావాలి?" నాగరాజు మాటల్లో వ్యంగ్యం అర్థం కాకపోలేదు అబద్ధయ్యకు. అయినా ఏమంటాడు?

"నన్నెందుకు పిలిపించినట్లు?" తెలిసే అడిగాడు నాగరాజు

"ఆఁ....మరేంలేదు. ఎట్లావుంది మీ మేష్టర్ల వుద్దేశం అసలు?"

"ఆఁ....మాకిదే పట్టింది. ఎవడు గెలిచినా మానోట మట్టికొట్టేవాడే!" విసుక్కున్నాడు నాగరాజు.

"అందరూ ఎందుకు చేస్తారయ్యా! నేను చూడు, మొన్న రెండునెలల బోనసు ఇచ్చాను వర్కర్లకి, గుమస్తాలకి." సగర్వంగా చెప్పుకున్నాడు.

"అవునుమరి ఎలక్షన్ వ్యూహం అంటే ఇలాగే ఉండాలి పేపర్లో ఫొటోతోసహా అచ్చు వేయించుకున్నారు ఛోటాపత్రికలలో సంపాదకీయాలుకూడా వ్రాయించుకున్నారు నాబోటివాడు ఎన్నిత్యాగాలు చేసివుంటేమాత్రం ఏమి? నా మొహం ఎవడు చూస్తాడు ఏదో ఎలక్షనంటూ వచ్చింది గాబట్టి పిలిపించారు." నిర్మొహమాటంగా అన్నాడు నాగరాజు ఇక అతనితో వాదించడం అనవసరమనుకుని లెదర్ బ్యాగ్‌నుంచి మూడు నూరురూపాయల నోట్లు తీశాడు అబద్ధయ్య "ఉంచుకో. నాకు తెలుసు, ఆ అనంతయ్య నీ చుట్టూ తిరిగాడని. వాడిమొహం! వాడిమాట వినేదెవరు కాంగ్రెసులో నీకూ, మరో ఇద్దరికీ కోరినచోట భూమి, ఉద్యోగం, ఇప్పించే హామీ నాది. ధైర్యంగా ఉండు" అంటూ చేతిలోపెట్టాడు.

"హే! దేశనాయకులారా! మన్నించండి! మీరు నామొహం చూడకపోయినా, యీ అబద్ధయ్య మూలాన యీ డబ్బును నేను నాకోసం, తీసుకోక తప్పడంలేదు" మనసులో అనుకుని జేబులో పెట్టుకున్నాడు

* * *

నాగరాజును, మామగారు తన వూళ్ళో హైస్కూలులో హఠాత్తుగా ఖాళీవస్తే వచ్చి వెంటపెట్టు కెళ్ళాడని, బహుశః ఐదెకరాల పొలంకూడా ఆ వూళ్ళోనే వాగువొడ్డునవున్న బంజరును అల్లుడికి మంజూరుచేయించే పలుకుబడి కలెక్టరు దగ్గిర సంపాదించాడని విన్న అబద్ధయ్య, అనంతయ్యలు నోరు వెళ్ళబెటారు.